సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఉద్యోగుల శ్రమదానం



విభాగంవద్ద శ్రమదానం చేస్తున్న ఉద్యోగులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది శనివారం సాయంత్రం శ్రమదానం నిర్వహించారు. విభాగం ఎదురుగా ఉన్న కలుపు మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. విభాగం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేసుకుని సుందరంగా తీర్చిదిద్దారు.

ఫ్యాప్టో ఉపాధ్యాయుల నిరసన



డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఉపాధ్యాయుల సమస్యలపై ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు ఆధ్వర్యంలో శనివారం డీఈవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ డి.జోజిబాబు మాట్లాడుతూ పాఠశాల విద్యను గందరగోళానికి గురిచేస్తున్న అసంబద్ధమైన వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ ప్రక్రియను విద్యాశాఖాధికారులు వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఉపాధ్యాయులకు బదిలీలు జరిగినవారికి, పదోన్నతులు కల్పించిన వారికి ఇంతవరకు జీతాలు చెల్లించలేదన్నారు. ఆ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేస్తున్న జీవో నంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ సీహెచ్ వెంకటరమణ, జిల్లా నాయకులు టి.రామకృష్ణారావు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే అదుర్స్



నృత్యాలు చేస్తున్నారు విద్యార్థినులు

మద్దిలపాలెం : వెస్టర్న్ మ్యూజిక్‌కు తగ్గట్టుగా విద్యార్థులు నృత్యాలతో హోరెత్తించారు. సంప్రదాయ నృత్యాలను మేళవించి కనువిందు చేశారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శ్రీ కాశ్యప్ జూనియర్ కళాశాల ఫ్రెషర్ డే వేడుకల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులు సందడి చేశారు. కళాశాల డైరెక్టర్లు టీఆర్ఎస్ వర్మ, ఎస్.నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, సత్యనారాయణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా సంగీత హోరులో జోరుగా హుషారుగా నృత్యాలు చేస్తూ అలరించారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు నిర్వహించిన ర్యాంప్ వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్తమ ప్రదర్శనకు కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐఐపీఎంలో సదస్సు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎం) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇగ్నైటింగ్ మైండ్స్ అంశంపై శనివారం సదస్సు జరిగింది. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆచార్యుడు వీరేంద్ర శుక్లా ఈ సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్నారు. బిజినెస్ స్కూల్ విద్యార్థులు భావి వ్యాపారవేత్తలుగా, హెచ్ఆర్‌లుగా ఎదిగే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణయాలు, పాటించాల్సిన ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐఏఎం బిజినెస్ స్కూల్ డైరెక్టర్ జనరల్ సతీష్, ఐఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606
సాక్షి

ఆరిలోవకు రింగ్ రోడ్డు !

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో రింగ్ రోడ్డు కల నెరవేరనుంది. కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న ఈ ప్రాంతీయులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అది సాధ్యం కానుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అదిగో..ఇదిగో అంటూ ఊరించిన చేతులెత్తేసింది. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రింగ్ రోడ్డు కోసం రహదారుల విస్తరణ చేపడతామంటూ పదేసార్లు చెప్పి హామీ నిలబెట్టుకోలేకపోయారు. ఇప్పుడు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచనలతో జీవీఎంసీ అధికారులు ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల రహదారుల విస్తరణకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు మరికొన్ని రోడ్ల విస్తరణపై అధికారులు దృష్టిపెట్టారు. దీనికి సంబంధించి శుక్రవారం మేయర్‌తో పాటు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ ప్రాంతంలో రహదారులను పరిశీలించారు. ఎక్కడ నుంచి రింగ్ రోడ్డు నిర్మించాలో అధికారులతో చర్చించారు. ఏఏ రోడ్లను విస్తరించాలి, ఎన్ని కిలోమీటర్లు రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలో చర్చించారు.

పదేళ్ల క్రితమే ప్రతిపాదన

సుమారు పదేళ్ల క్రితమే జీవీఎంసీ అధికారులు రింగ్ రోడ్డు ప్రతిపాదన చేశారు. బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని పెదగదిలి రోడ్డు నుంచి తోటగరువు, బాలాజీనగర్, అంబేద్కర్ కూడలి, పార్వతీనగర్, సూర్యతేజానగర్ మీదుగా చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద బీఆర్‌టీఎస్ కూడలి వరకు నిర్మించదలిచారు. ఇందులో భాగంగా అప్పట్లో పెదగదిలి కూడలి నుంచి తోటగరువు వరకు 80 అడుగులు రోడ్డు విస్తరణ చేశారు. తోటగరువు నుంచి బాలాజీనగర్ వరకు, అంబేద్కర్‌నగర్ నుంచి పార్వతీనగర్ వరకు రోడ్డును విస్తరించకుండా అధికారులు వదిలేశారు. దీంతో ఆయా చోట్ల విస్తరణ కాకపోవడంతో రింగ్ రోడ్డు నిర్మాణం కలగా మిగిలిపోయింది. నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే వెలగపూడికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు.

మేయర్ చొరవతో..

ఆరిలోవలో జనాభా పెరుగుతోంది. దానికి తగినట్టు వాహనాలు రద్దీ పెరగడంతో ప్రస్తుతం ఉన్న ఇరుకు రోడ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చొరవతో మళ్లీ రింగ్‌రోడ్డు ప్రతిపాదన తెరపైకి వచ్చింది. గతంలో ఎక్కడెక్కడ రోడ్డు విస్తరణ నిలిచిపోయిందో ఆయా చోట్ల పనులు ప్రారంభించి నిర్మాణం చేపట్టదలిచారు. ఇప్పటికే బీఆర్‌టీఎస్‌లో చినగదిలి కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో డబుల్ రోడ్డు నిర్మించారు. దాన్ని ఆనుకొని పార్వతీనగర్ వద్ద గెడ్డ విస్తరణ పనులు చేపట్టారు. పార్వతీనగర్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ఉన్న కొన్ని నివాసాలు, షాపులు తొలగించాల్సి ఉంది. దీంతో పాటు బాలాజీనగర్ నుంచి తోటగరువు వరకు రోడ్డుకు ఇరుపక్కల ఉన్న షాపులను తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఇదిలా ఉండగా తోటగరువు కూడలి నుంచి శాంతినగర్ మీదుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీనగర్ నుంచి అంబేద్కర్‌నగర్ కూడలి రోడ్డు



పార్వతీనగర్‌లో పర్యటిస్తున్న మేయర్ వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ(ఫైల్)

రహదారుల విస్తరణ అవసరం



ఆరిలోవ ప్రాంతంలో జనాభా పెరుగుతోంది. గతంలో నిర్మించిన రోడ్లు చిన్నవి కావడంతో వాహనాల రద్దీతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం రోడ్లు విస్తరణ చేపడుతున్నాం. ఇందులో భాగంగా గతంలో నిలిచిపోయిన సుమారు మూడు కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నాం. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించాం. ఇక్కడ రింగ్ రోడ్డు నిర్మిస్తే ఆరిలోవ కాలనీ, శ్రీకాంత్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలు నుంచి వాహన చోదకులకు మరింత సౌలభ్యం కలుగుతుంది. త్వరలో పనులు చేపడతాం.

–గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

ఏయూక్యాంపస్: స్థానిక 20వ వార్డు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకట రావు పాల్గొన్నారు. ముందుగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వెంకటరావు పాల్గొని, భక్తులకు స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు కార్యదర్శి మెల్లి అప్పారావు, వార్డు కార్పొరేటర్ ముర్వల లక్ష్మి, 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, పార్టీ నాయకులు ముర్వల సురేష్, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ పందరీబాయి, ట్రస్టీబోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న అక్కరమాని వెంకట రావు

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యాలు చేస్తున్న చిన్నారి కళాకారిణులు

ఎంవీపీకాలనీ: శ్రీసాయి నటరాజ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు అలరించాయి. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో నిజ శ్రావణ మాస వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల చేత ప్రత్యేక నృత్యప్రదర్శనలు నిర్వహించారు. నృత్య అకాడమి ప్రతినిధి ఉషశ్రీ ఆధ్వర్యంలో చిన్నారి కళాకారిణులు లక్ష్మీవర్షిణ్య, భవిత, ఆరాధ్య, రుషిత, సైనిక, శ్రేయ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారికి పుష్పాంజలి, కళింగ నర్తనం తదితర అంశాలను అత్యంత శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవల్లోనే సంతృప్తి

- సొంత నిధులతో ప్రజల దాహార్తి తీరుస్తున్న ఆటో డ్రైవర్
- రోజుకు సుమారు రూ.400 వరకు కేటాయింపు



జగదాంబ జంక్షన్‌లో నిలిపిన దుర్గాప్రసాద్ ఆటో వద్ద మంచినీళ్లు తాగుతున్న సెక్యూరిటీ గార్డ్

డాబాగార్డెన్స్ : రోజంతా కష్టపడితేనే ఇంటిల్లిపాదీ కడుపు నిండే రోజులివి. సామాన్యుడు ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు శ్రమిస్తేనే ఆ కుటుంబం నాలుగు మెతుకులు తినగలుగుతుంది. అటువంటిది తనకు వచ్చే కొద్దిపాటి ఆదాయంలోనే కొంత మొత్తాన్ని సమాజ సేవకు వెచ్చిస్తున్నాడో యువకుడు. ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్న అతను సమాజ సేవలో పునీతుడవుతున్నాడు. గోకుల్ థియేటర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ దుర్గాప్రసాద్ చదువుకున్నది తక్కువే. కానీ సమాజసేవ చేయాలన్న తపన అతనిలో మెండుగా ఉంది. బడి పిల్లల్ని నిత్యం స్కూళ్లకు తీసుకెళ్తుంటాడు. ఉదయం పాఠశాలలకు పిల్లల్ని తీసుకెళ్లి.. సాయంత్రం వారి ఇళ్ల వద్ద దింపుతుంటాడు. మధ్యలో బేరాలు కడుతూ కుటుంబ పోషణలో ప్రధానపాత్ర పోషిస్తున్నాడు.

చిన్నతనం నుంచి సేవాదృక్పథం..

దుర్గాప్రసాద్‌కు చిన్నప్పటి నుంచే సమాజ సేవ చేయాలన్న తపన. కానీ డబ్బు లేదు. ఆటో వేస్తూ వచ్చిన ఆదాయంలోనే కొంత సేవలకు వినియోగిస్తున్నాడు. ఆటో వెనుక ఉన్న ఖాళీ భాగంలో వాటర్ ట్యాంక్‌లు పెట్టుకుని ఉచిత మంచినీటి సేవకు గత వేసవిలో శ్రీకారం చుట్టాడు. బేరం కట్టుకుంటూ ప్రధాన జంక్షన్ల వద్ద తన ఆటోను ఓ మూల నిలుపుతాడు. దగ్గరలోని కూలీలు, కార్మికులు, పౌరులు దాహార్తి తీర్చుకునేందుకు అతని ఆటో వద్దకు చేరుకుని ఉచిత చల్లని మంచినీరు తాగుతుంటారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి..



ఉదయం నుంచి వీధుల్లోనే ఉంటాను. చల్లని మంచినీటిని ఉచితంగా నగర ప్రజలకు అందజేస్తుంటాను. రోజుకి 10 నుంచి 12 వాటర్ ట్యాంక్‌ల ద్వారా నగర ప్రజలకు ఉచిత చల్లని మంచినీటిని అందజేస్తున్నాను. దీనికి గాను రోజుకి సుమారు రూ.400 నుంచి రూ.500 వరకు వెచ్చిస్తున్నాను. ఈ సేవలో నాకు తృప్తి దొరుకుతోంది.

-వై. దుర్గాప్రసాద్, ఆటో డ్రైవర్, గోకుల్ స్టాండ్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమారకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

మహారాణిపేట : వైఎస్సార్‌టీయూసీ యూనియన్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా దుస్తులు మార్చుకోవటానికి వేర్వేరుగా ప్రత్యేక గదులు కేటాయించాలన్నారు. దీనికి సూపరింటెండెంట్ స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడు ఒమ్మి లక్ష్మణరావు, కార్యదర్శి ఎ.రామారావు, కోశాధికారి పి.అప్పలస్వామి, జాయింట్ సెక్రటరీ సిరిపెల్లి రాజారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.పార్వతి, ఎస్‌కే బేగం పాల్గొన్నారు.

మానవ హక్కుల చట్టాలపై అవగాహన లేదు

డాబాగార్డెన్స్ : మానవ హక్కుల చట్టాలపై ఉన్న తాధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన లేదని రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ల ఆదేశాలు, సిఫారసులు అమలు కావడం లేదని, జిల్లా మానవ హక్కుల కోర్టులు ఏ రాష్ట్రంలో కూడా లేవని ప్రధాన మంత్రి కార్యాలయానికి మానవ హక్కుల కౌన్సిల్ ఫిర్యాదు చేసిందన్నారు. బాధితులకు ఉపశమనం లభించడం లేదని, మానవ హక్కుల కోర్టులు హక్కుల ఉల్లంఘన వంటివి విచారించే స్థాయి లో లేనందున ఉత్సవ విగ్రహాలుగా మారాయన్నారు.

ఆశ్రమానికి వృద్ధుడ్ని తరలించిన హోంగార్డ్

డాబాగార్డెన్స్ : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా పని చేసే జోగా ఉదయ్‌కుమార్ శనివారం ఉదయం మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లినప్పుడు అతని కంట ఓ వృద్ధుడు బీచ్‌రోడ్డులో కనిపించాడు. తన స్నేహితుల వాట్సప్ గ్రూప్‌లో ఆ వృద్ధుడినే తాను చూసినట్లు ఉదయ్‌కుమార్‌కు అర్థమైంది. సామాజిక సేవ అభిరుచి గల ఉదయ్‌కుమార్ ఆ వృద్ధుడి వివరాలు తెలుసుకోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ వృద్ధుని పేరు నాగరాజు అని, అతని అల్లుడు కంచరపాలెంలో ఉంటాడని తెలిసి ఉదయ్‌కుమార్ ఆ వివరాలపై ఆరా తీశారు. ఫలితం లేకపోయింది. దాంతో ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్ పోలీస్ కేంద్రం దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. వారి సహాయంతో పలు పోలీస్‌స్టేషన్లకు ఫోన్ చేసి మిస్సింగ్ కేసులు ఏమైనా నమోదయ్యాయా అని ఎంక్వైరీ చేశారు. అయితే ఎక్కడా అటువంటివి నమోదు కాలేదని తెలిసింది. దాంతో వృద్ధుడిని నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు.



ఏపీ టూరిస్ట్ పోలీస్ కేంద్రానికి వృద్ధుని అప్పగిస్తున్న హోంగార్డ్ ఉదయ్‌కుమార్

మీ సేవా కేంద్రాల సమస్యలు పరిష్కరించాలి



ప్రత్యేక అధికారి పూర్ణిమాదేవిని అభినందిస్తున్న మీ సేవా కేంద్రాల నాయకులు

మహారాణిపేట : తమ సమస్యలు పరిష్కరించాలని మీ సేవా కేంద్రాల యూనియన్ నాయకులు కోరారు. గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి ఆర్.పూర్ణిమాదేవిని మీ సేవా కేంద్రాలకు విజిలెన్స్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు మీ సేవా కేంద్రాల యూనియన్ నాయకులు పూర్ణిమాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి తమ గోడు వినిపించుకున్నారు. అనంతరం పూర్ణమాదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీ ఆన్‌లైన్ మేనేజర్ రాజేష్, సీఎంఎస్ మేనేజర్ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలి

- జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా



మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా

డాబాగార్డెన్స్ : సమాజంలో సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలని జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా పేర్కొన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సఫాయి కార్మికుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రాలు, మున్సిపాల్టీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందన్నారు. మురుగు కాలువలను మాన్యువల్‌గా శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పాటుపడుతూ, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నేతలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు సత్కారం



యూఎస్‌లో చదువుకు ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: విదేశీ చదువులకు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపిక వారి ప్రతిభకు నిదర్శనమని విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయాధికారిని ఎస్.రూపావతి అన్నారు. ఇటీవల ద కెన్నడి– లూథర్ యూత్ ఎక్ఛేంజ్ అండ్ స్టడీ ప్రొగ్రాంలో భాగంగా యూఎస్ చదువుకు ఎంపికైన కొమ్మాది గురుకుల పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఆర్.ఇవాంజలి, ఎస్.జ్ఞానేశ్వరరావుల సత్కార కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇందులో వెలకట్టలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు కృష్ణా కళాశాల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన విద్యార్థినులు

మద్దిలపాలెం : రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్టివల్‌కు డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. రెండు రోజులుగా నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్‌లో జానపద గీతాల విభాగంలో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫెస్టివల్ ఎంపికయ్యారన్నారు. వీరిలో ఆర్.సునీత, సీహెచ్.సునీత, కావ్యశ్రీ, రాజీ, హాసినిలు బృందం గీతాలాపన విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారన్నారు. దీంతో వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వీక్‌ను నిర్వహించారు. వారం రోజులుగా విభాగాలలో విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధ చట్టాలు, శిక్షలు, పర్యవసానాలను వివరించారు. ర్యాగింగ్‌కి దూరంగా ఉండాలని, స్నేహపూర్వక వాతావరణంతో మసలుకోవాలని విద్యార్థులకు ఆచార్యులు సూచించారు. విద్యార్థుల్లో మరింత అవగాహన పెంచే విధంగా వ్యాసరచన, ఉపన్యాస, పోస్టర్ల తయారీ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ర్యాగింగ్ నిషేధంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమన్వయకర్త ఆచార్య ఎ.ప్రసాద్, విభాగాల ఆచార్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయుక్తంగా సదస్సులు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న నిర్వాహకులు

ఏయూక్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా సదస్సుల నిర్వహణ జరగాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహా రావు అన్నారు. ఏయూ హిందీ విభాగంలో హిందీ సాహిత్య నిర్మాణంలో మాండలీల భాష రూపాల పాత్ర అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరభారత దేశం నుంచి హిందీ భాష శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. చర్చా కార్యక్రమంలో ఆచార్య అర్జున్ పాండే, విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షులు ఆచార్య యస్.ఎం ఇక్బాల్, ఆచార్య సీతాలక్ష్మి, ఆచార్య సూరప్పడు, ఆచార్య అరుణ్‌కుమార్ మిశ్ర, సంకల్ప్ సాహితీ సంస్థ అధ్యక్షుడు దినకర్, డాక్టర్ కె.కాంతి, డాక్టర్ ఎస్.కృష్ణబాబులు పాల్గొని ప్రసంగించారు. హిందీ కవిసమ్మేళనంలో డాక్టర దీపా గుప్త, సుధా కుమారి ఖుషి, శివమ్ తివారి, కాంతి మిశ్ర గుంజన్, జయ్ ప్రకాష్‌సింగ్, ఉజ్వల్ గోయల్‌లు తమ కవితలతో శ్రోతలను రంజింపజేశారు. కార్యక్రమంలో ఆచార్య వై.వెంకట లక్ష్మి, విజయభారతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విశాఖ హిందీ పరిషత్, అవధీ సాహిత్య సంస్థాన్ సంయుక్తగా నిర్వహించాయి. అనంతరం అతిథులను సత్కరించారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

27న మహా రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: మానవత మూర్తి మదర్ థెరిసా జయంత్సోవం సందర్భంగా ఈనెల 27వ తేదీన పెదజాలారిపేట ఆర్టీసీ డిపోవద్ద మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సామాజిక కార్యకర్త, రక్తదాన శిబిరం నిర్వాహకుడు ఒలిశెట్టి గురునాథ్ తెలిపారు. ఈ 66వ రక్తదాన శిబిరానికి యువత స్వచ్ఛందంగా పాల్గొలన్నారు. రక్తదానం చేసేవారు ముందుగా ఆదివారం ఉదయం 10 గంటలకు శిబిరంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కళాభారతిలో నేడు వీణ కచేరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో కళాభారతి మద్దిలపాలెంలో ఆదివారం అమెరికాకు చెందిన అమృత వర్షణి అచెల్లచే వీణావాదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వీఎంఏ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com